బాధితురాలిని పరామర్శించిన

మాజీమంత్రి, మాజీఎమ్మెల్యే

బాధితురాలిని పరామర్శిస్తున్న మాజీమంత్రి, మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల), జూలై 14 : కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కేబీఆర్‌గౌడ్ తల్లి మాజీ సభ్యురాలు జయలక్ష్మి అనారోగ్యంతో చికిత్సలు పొందిన అనంతరం ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటుంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ఇంటికెళ్లి బాధితురాలిని పరామర్శించి ఆరోగ్య విషయం తెలుసుకున్నారు. సమయానికి అవసరమయిన మందులు వాడాలని సూచించారు.

ప్రిన్సిపాల్ బదిలీతో కన్నీరుపెట్టిన విద్యార్థులు

ప్రిన్సిపాల్ చుట్టూ చేరి కన్నీరు పెడుతున్న విద్యార్థులు

మరికల్, జూలై 14: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ మెదక్ జిల్లా తుఫ్రాన్‌కు బదిలీ అయ్యారు. విషయం తెలియడంతో ఆదివారం విద్యార్థులు కన్నీరుపెట్టారు. తమను వదిలి వెళ్లవద్దంటూ అడ్డుకున్నారు. విద్యార్థుల అభిమానానికి ప్రిన్సిపాల్ సైతం కన్నీరుపెట్టారు. విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి స్థాయిలో నిలవాలని ప్రిన్సిపాల్ అన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి నియంత్రణ

గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ధ్యాన నిపుణులు

నారాయణపేట టౌన్, జూలై 14: ధ్యానంతో మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చని శ్రీరామ చంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన నిపుణులు ఆంజనేయులు, జనరల్ ఫిజీషియన్ కార్తీక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పతాంజలి యోగా శిక్షణ కేంద్రంలో ధ్యాన సమావేశం నిర్వహించి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనో నియంత్రణకు ధ్యానం సాధనమన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ 30నిమిషాల పాటు ధ్యానం చేయడం అలవర్చుకోవాలన్నారు. ఈనెల 21న నందిగామ మండలం కన్వా శాంతి వనంలో జరిగే గురుపౌర్ణమి వేడుకల్లో అభ్యాసకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పతాంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు సురేశ్‌కుమార్, రాజేందర్‌లాహోటి, యశ్వంత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి యువకుల చేయూత

మొర్రంమట్టితో చదును చేయిస్తున్న యువకులు

జడ్చర్ల, జూలై 14: జడ్చర్ల మండలంలోని గంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటస్థలాన్ని గ్రామ యువకులు చదును చేయించారు. పాఠశాల ఆవరణలో ఉన్న ఆటస్థలంతో పాటు పాఠశాల చుట్టూ గుంతలు ఏర్పడడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. అది గమనించిన గ్రామ యువకులు తమవంతుగా టిప్పర్లతో మొర్రంమట్టి వేయించి చదును చేయించారు. ఈ సందర్భంగా హెచ్ ఎం అనంతప్ప యువకులకు అభినందనలు తెలిపారు. మైలారం శివారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివారెడ్డి మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పాటుపడటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ యువకులు కేశవ్, గౌరిశంకర్, నరేశ్‌చారి, చంద్రప్రకాశ్, అరవింద్, శివ ఉన్నారు.

Before the Hon'ble Arbitrator / Dy. Registrar of Chits at Mahabubnagar
ARB. Claim No.210 of 2024
Between
SHRIRAM RAGHAVENDRA CHITS BR. Mahabubnagar **... Disputant**
And
P. Shailaja and others **...Opponents**
5) K. Santhosh Kumar S/o K. Rupla, Aged: 31 years, Occ: Business, R/o H.No.5-59, Pallumidi Thanda, Bodajanampet (v), Balanagar (M), Mahabubnagar (D) **...Opponent**
Claim for Recovery of Rs.14,48,232/- (Rupees Fourteen Lakhs Fourty Eight Thousand and Two Hundred Thirty Two only)
Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P. Chit Fund Act. and Rules of 2008 against you and others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No.7-5-108/2/A, back side of Telephone Exchange, Venkateshwara Colony, Mahabubnagar on **27-07-2024** at **11-30A.M.** for your appearance, in person or through an Advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the Claim will be decided ex-parte.
"By the order of the Arbitrator"
Mahabubnagar
S. MALLA REDDY Advocate
H.No.8-6-212, Padmavathi Colony
Mahabubnagar . Cell No.9000002415

పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడికి సన్మానం

మరికల్, జూలై 14: ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, పండిత్ అప్‌గ్రేడ్‌లను విజయవంతంగా పూర్తి చేయడంలో ముఖ్య భూమిక పోషించిన టీజీ పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలి హర్షవర్ధన్ రెడ్డిని ఆదివారం నారాయణ పేట జిల్లా టీజీ పీఆర్‌టీయూ అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నారాయణ, శ్రీశైలం పాల్గొన్నారు.

నేడు వనమహోత్సవం

నారాయణపేట, జూలై 14: పట్టణంలోని యాద్గిర్ రోడ్‌లో ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలంలో సోమవారం ఉదయం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సునీత ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పర్ణికారెడ్డి హాజరవుతారని, చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కార్యాలయ అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

జలమయమైన ఎల్లమ్మకుంట

- **ఇండ్లలోకి చేరిన వర్షపు నీరు**

మక్తల్, జూలై 14: మక్తల్ మున్సిపాలిటీలోని 9వవార్డులోని ఎల్లమ్మకుంట వర్షపునీటితో జలమయమైంది. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కాలనీలోని ఇండ్లలోకి వర్షపునీరు చేరింది. ఎల్లమ్మకుంటలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపునీరు, మురుగునీరు రోడ్లపై నిలిచి ఇండ్లలోకి చేరింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు.

మక్తల్ ఎల్లమ్మకుంట వీధిలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

మక్తల్ కాలనీలో చేరిన వర్షం నీరు

పాలమూరులో వర్షం

మహబూబ్‌నగర్, జూలై 14 : పాలమూరులోని పలుప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం ఓమోస్తరు వర్షం కురిసింది. రోడ్లపై నీళ్లు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 6.8 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఆగుతూ కురుస్తుండడంతో ప్రజలు ఇండ్లలోనే ఉన్నారు. వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

మహబూబ్‌నగర్ వర్షం కురుస్తున్న దృశ్యం

మక్తల్‌లో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

ధన్వాడ, జూలై 14: మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు రహమత్‌ఖాన్, మాజీ వార్డు సభ్యుడు అచ్చుబాబు తెలిపారు. ఇక్కడ నలుగురు ఉపాధ్యాయులే ఉన్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని, విద్యావలంటీర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

బాలానగర్, జూలై 14: బాలానగర్ చౌరస్తా నుంచి తిరుమలగిరి మీదుగా జడ్చర్ల మండలం గంగాపూర్ వరకు నిర్మించనున్న రహదారి నిర్మాణం పనుల శంకుస్థాపనకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం శిలాఫలకం నిర్మాణం పనులను అధికారులు పరిశీలించారు. ఈరహదారి నిర్మాణం పూర్తయితే బాలానగర్, పెద్దరేవల్లి, తిరుమలగిరి, చిన్నరేవల్లి, కోడుగల్, గంగాపూర్ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని డీఈ సంధ్య పేర్కొన్నారు.

రైతుల హామీలపై కాలయాపన

నారాయణపేటరూరల్, జూలై 14 : అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని బీజేపీ మండల నాయకులు ఎ.నారాయణరెడ్డి ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించారు.

మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రుణమాఫీ హామీని వెంటనే అమలు చేసి, రైతు భరోసాను చెల్లించాలని కోరారు.

మండల అధ్యక్షుడిగా ఎన్నిక

మరికల్, జూలై 14: మండల వీరశైవలింగాయత్ ఎన్నికలు ఆదివారం మండల కేంద్రంలోని పాతకుర్వగేరిలో గత శివాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా నాయకులు శివకుమార్, వీరన్న తెలిపారు. మండల గౌరవ అధ్యక్షుడిగా బస్వరాజ్, మండలాధ్యక్షుడిగా తిప్పయ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ మల్లికార్జున్, ఆకుల మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా గట్టుబసంత్, కోశాధికారిగా శెట్టిసోమనాథ్‌ను ఎన్నుకున్నామన్నారు.

చెట్టును ఢీకొన్న కారు.. వ్యక్తి దుర్మరణం

తిమ్మాజిపేట, జూలై 14 : తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన ఘటన లో ఒకరు మృతి చెందారు. పోలీసుల వివరా ల మేరకు గోపాల్‌పేట మండలం లక్ష్మీతండాకు చెందిన సంతోష్(30) హైదరాబాద్‌లో కారు నడుపుతూ జీవిస్తున్నాడు. స్వగ్రామం లో బోనాల పండుగ ఉండడంతో శనివారం రాత్రి భార్య శారదతో కలిసి గ్రామానికి కారు లో బయలుదేరాడు. రాత్రి 12:30కి తిమ్మాజిపేట వద్దకు రాగానే కారు అదుపుతప్పడం తో రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టుకుంది. ఘటనలో సంతోశ్ అక్కడికక్క డే మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై నరేం

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

హన్వాడలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

హన్వాడ, జూలై 14: ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని చిన్నదర్‌పల్లిలో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు అందగా అలంకరించిన బోనం కుండలను నెత్తిన పెట్టుకుని, ఊరేగింపుగా ముందుకు కదిలారు.

కట్ట మసమ్మకు ప్రత్యేక పూజలు

దేవరకద్ర, జూలై 14 : పట్టణ సమీపంలో ఉన్న కట్ట మసమ్మకు ఆదివారం స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 23న పోచ్చమ్మ బోనాల సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక బోనంతో ర్యాలీగా బయలేదేరి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

పల్లెల్లో కొలువుదీరిన పీర్లు

దేవరకద్ర, జూలై 14 : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్ల మజీద్‌ల్లో పీర్ల ప్రతిష్ఠించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పీర్లను ప్రతిష్ఠించారు.

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు

ఊట్కూర్, జూలై 14 : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలను మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం 7వ రోజు (సాత్‌మీ) వేడుకలను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో భక్తులు పీర్ల చావిడీలను దర్శించుకున్నారు. మహిళలు బొడ్డెమ్మ వేయగా, యువకులు కేరింతలు కొడుతూ అలయ్ బలాయ్ ఆడి ఆకట్టుకున్నారు. మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎస్సై నవీద్ ఊరేగింపును పర్యవేక్షించారు.

గోపన్‌పల్లిలో ప్రతిష్ఠించిన పీర్లు

ఊట్కూర్‌లో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

భూత్పూర్, జూలై 14 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీని నెరవెర్చాలని జిల్లా ముదిరాజ్ మహాసభ డైరెక్టర్ వెంకట్రాములు కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని మునిరంగస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ముదిరాజ్ కులస్థులు పెద్దసంఖ్యలో ఉన్నారు. అయినా అన్నిరంగాల్లో వెనకబడి ఉన్నారని ఆయన అన్నారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలంటే బీసీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కమిషన్ మేరకు బీసీ-ఏ లోకి మార్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

మరికల్‌లో పోస్టర్‌ను విడుదల చేస్తున్న మత్స్యకారుల నాయకులు

ముదిరాజ్ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

మరికల్, జూలై 14: తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించాలని మరికల్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కానుగంటి నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమస్యలతో కుడిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ-డీలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జంగిడి శ్రీనివాసులు, రామకృష్ణ పాల్గొన్నారు.

భూత్పూర్‌లో పోస్టర్‌ను విడుదల చేస్తున్న ముదిరాజులు

ఆత్మీయ సమ్మేళనం

నవాబ్‌పేట, జూలై 14: మండలంలోని కొల్లూరు ఉన్నత పాఠశాల 2003-04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరుపుకొన్నారు. కొల్లూరు పాఠశాలలో 20ఏండ్ల క్రితం పదోతరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు సుదీర్ఘకాలం తర్వాత ఒకేవేదికపై కలుసుకొని వారి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. నాటిపూర్వ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు మజరుల్లా కొత్వాల్, లక్ష్మణ్, సత్యనారాయణరెడ్డి, జహంగీర్, రామలింగం, దేవదాస్, మాధవీలత, మోసిన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒకే వేదికపై పూర్వ విద్యార్థినులు

పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం

జడ్చర్ల, జూలై 14: వారంతా చిన్ననాటి స్నేహితులు. అందరూ ఒకేచోట చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక వివిధ ప్రాంతాలకు పైచదువులకు వెళ్లారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని బాదేపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో 1989-90 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థినులు ఆదివారం జడ్చర్లలోని భవాని మినీ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. అందరూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థినులు మాధవి, గీర్వాణి, శాంత, సుజాత, కల్పలత, జ్యోతి, భవాని, శ్రీదేవి, ఉమాదేవి ఉన్నారు.

'డీఎస్సీని వాయిదా వేయాలి'

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 14: రాష్ట్ర నిరుద్యోగులు చేపట్టిన ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తూ డీఎస్సీని వాయిదా వేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిరుద్యోగుల డిమాండ్లపై స్పందించి డీఎస్సీని వాయిదా వేసి, గ్రూప్1, గ్రూప్2 పోస్టులను పెంచి, పరీక్షలు నిర్వహించాలని కోరారు. తాజాగా సీఎం వ్యాఖ్యలు నిరుద్యోగులను అవమానించేలా ఉన్నాయని, ఇప్పటికైనా ఉద్యమ సంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

నేడు మంత్రుల పర్యటన

జడ్చర్ల/మిడ్జిల్/నవాబుపేట్, జూలై 14: జడ్చర్ల నియోజకవర్గంలోని బాలానగర్, రాజాపూర్, మిడ్జిల్ మండలాల్లో సోమవారం మంత్రులు రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహ, అబ్కారిశాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభం

ఊట్కూర్, జూలై 14: మండల కేంద్రంలో తాజ్ దక్కన్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాజ్ దక్కన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు సలీం నవాబ్ మాట్లాడుతూ.. మైనార్టీ విద్యార్థులు కంప్యూటర్ విద్యలో రాణించి ఐటీరంగంలో గొప్ప అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆశించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు గౌస్ మహ్మద్, నాజిం అహ్మద్, ఖాజీం హుసేన్, కుర్షీద్, రహీంపాష, జమీర్ అలీ, ఇబ్రహీం పాల్గొన్నారు.

21న మాణికేశ్వరీమాత జన్మదిన ఉత్సవాలు

వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న భక్తులు

నారాయణపేట, జూలై 14: యానగుందిలోని సూర్యనంది క్షేత్రంలో ఈనెల 21న ఆషాఢ శుద్ధ గురుపౌర్ణమి రోజున మాణికేశ్వరీమాత 91వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వాల్వేకర్‌నికేతన్, దశరథ్, సీతారాములు తెలిపారు. ఆదివారం పట్టణంలోని చౌక్ బజార్ వద్ద ఉత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మహారుద్రాభిషేకం, పాదుకపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయానికి వితరణ

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రాములు

మరికల్, జూలై 14: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సరస్వతీదేవి ఆలయ నిర్మాణానికి ఎలిగండ్ల గ్రామానికి చెందిన మేస్త్రీ రాములు రూ.10వేలు అందజేశారు. గౌతమీ స్కూల్ కరస్పాండెంట్, బీఆర్ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి రూ.10వేలు విరాళం ఇచ్చారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జగదీశ్, దుబాయి రాములు, నారాయణ, కృష్ణయ్య, రాయుడు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

జడ్చర్లటౌన్, జూలై14: మున్సిపాలిటీ పరిధిలోని నల్లచెరు వు ట్యాంక్‌బండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి (50)మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని నల్లచెరువు ట్యాంక్‌బండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. చెరువు నీటిలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం..

మూసాపేట(అడ్డాకుల), జూలై 14 : అడ్డాకుల మండలంలోని శాఖాపూర్ గ్రామంలో తాళం వేసిన ఇంటికి గుర్తు తెలియని దుండగులు కన్నం వేశారు. స్థానికులు, ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లేశ్ ఈ నెల 12వతేదీన ఇంటికి తాళం వేసి పెద్దమందడి మండలంలోని మొజర్ల గ్రామంలో ఉన్న వారి చుట్టాల ఇంటికి వెళ్ళారు. అయితే ఆదివారం తెల్లవారుజామున ఇంటి పక్క వాళ్లు చూసే సరికి తలుపు తెరిచి ఉండడంతో మల్లేశ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వెంటనే వచ్చి చూస్తే ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఎస్సై శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆనవాళ్లను సేకరించారు. నల్లపూసలదండ, చెవికమ్మలు కలిపి మొత్తం 2తులాల బంగారం చోరీ జరిగినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సైకి సన్మానం

ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

దామరగిద్ద, జూలై 14 : దామరగిద్ద నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాజును నారాయణపేట జిల్లా మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు గ్యాంగ్ హన్మంతు ఆదివారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాలల ఐక్య వేదిక మండల నాయకులు ఎంబి హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
TOURS & TRAVELS

★మహాదేవ టూర్స్: 6th నవంబర్-కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536
ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794